## క్లుప్తంగా

### రైతు భరోసాకు 10,206 మంది అర్హులు

**పుల్లలచెరువు:** మండలంలోని 19 సచివాలయాల పరిధిలో 10, 206 మంది రైతులు రైతు భరోసాకు అర్హులుగా నిర్ధారించినట్లు వ్యవసాయాధికారి నిర్మిలాదేవి తెలిపారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్రముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం విడుదల చేసిన రైతు భరోసాకు మండలంలో 10,206 మంది అర్హత సాధించగా ఒక్కో రైతుకు రూ.2 వేలు ఖాతాల్లో జమ చేయనున్నారని చెప్పారు.

**అర్హులందరికీ రైతు భరోసా**

**తాళ్లూరు (ముండ్లమూరు):** మండలంలోని 7460 మంది రైతులకు 2023–2024 సంవత్సరానికి గాను రెండోవిడత రైతుభరోసా నిధులు మంజూరైనట్లు వ్యవసాయాధికారి ప్రసాదరావు తెలిపారు. తాళ్లూరు రైతుభరోసా కేంద్రంలో రైతులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి చేతుల మీదుగా రెండో విడత నిధులు నేరుగా జమ చేయడం జరిగిందన్నారు. నగదును రబీలో సాగు ఖర్చులకు ఉపయోగించుకోవాలని ఎంపీడీఓ కె. యుగకీర్తి రైతులకు సూచించారు. నాగరాజునాయక్, వెంకటరావు, నాగరాజు, రైతులు పాల్గొన్నారు.

### జీఈఆర్ సర్వే త్వరగా పూర్తి చేయాలి

**పుల్లలచెరువు:** గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ సర్వేను త్వరగా పూర్తి చేయాలని ఎంఈవో శామ్యూల్ జాన్ అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వేల్ఫేర్ అసిస్టెంట్‌లతో జీఈఆర్ సర్వేపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి ఎంఈవో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జీఈఆర్ సర్వేను గతంలో గ్రామాల్లో నిర్వహించామని, బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి బడి చేర్పించాలని ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామని, మండలంలో దాదాపు 350 మంది విద్యార్థుల వివరాలు పెండింగ్‌లో ఉన్నాయని, గ్రామాల్లో ఉన్న వలంటీర్లు సహకారంతో వాటిని కూడా ఎన్‌రోల్ చేసి వాటి వివరాలు యాప్‌లో నమోదు చేయాలన్నారు. సిబ్బంది అశ్రద్ధ చేయకుండా సకాలంలో సర్వేను పూర్తి చేయాలని ఆదేశించారు.

### యర్రగొండపాలెంలో భారీ వర్షం

**యర్రగొండపాలెం:** యర్రగొండపాలెంలో బుధవారం భారీ వర్షం కురిసింది. దాదాపు గంట పాటు కురిసిన ఈ వర్షంతో పొలాలు, రోడ్లు జలమయమయ్యాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో ఉద్యాన పంటలు, కంది, మిరప, పత్తి పంటలకు ఎంతో మేలు జరుగుతుందని ఆయా శాఖల అధికారులు ఆదిరెడ్డి, శేషారెడ్డి తెలిపారు. పొలాల్లో నీరు నిల్వ చేరకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

**మార్కాపురంలో మోస్తరు వర్షం**

**మార్కాపురం:** మార్కాపురం పట్టణంతోపాటు సమీప గ్రామాల్లో మంగళవారం సాయంత్రం 4 గంటల నుంచి సుమారు గంటపాటు మోస్తరు వర్షం కురిసింది. వర్షంతో వీధులన్నీ జలమయమయ్యాయి. పత్తి, మిర్చి, కంది పంటలకు వర్షం మేలు చేస్తుందని రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

### సస్యరక్షణ చర్యలు పాటించాలి

**అర్ధవీడు (కంభం):** మిరప పంట రైతులు సస్యరక్షణ చర్యలు పాటించాలని స్థానిక ఉద్యానవన శాఖాధికారి శ్వేత అన్నారు. మండలంలోని కాకర్లలో మిరప పంట రైతులకు మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. మిరప పంటలో రసం పీల్చే పురుగులను నిర్మూలించాలన్నారు. నీలిరంగు జిగురు అట్టలు ఏర్పాటు చేయాలన్నారు. పేనుబంక నివారణకు ఇమిడా క్లో ప్రిడ్, ఎసిఫేట్ నీటితో కలిపి పిచికారీ చేయాలన్నారు. వీఏఏ రమాదేవి, రైతు భరోసా సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

### రేపు చర్మ వ్యాధులపై వైద్య శిబిరం

**గిద్దలూరు రూరల్:** స్థానిక నగర పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఈ నెల 9వ తేదీన ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు చర్మ వ్యాధులపై మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు కమిషనర్ వై.రామకృష్ణయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నంద్యాల శాంతిరామ్ వైద్యశాలకు చెందిన చర్మవ్యాధుల వైద్య నిపుణుల ఆధ్వర్యంలో చర్మ సమస్యలపై ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సదవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

### పండ్ల తోటల పెంపకంపై అవగాహన

**ముండ్లమూరు:** గ్రామాల్లో రైతులకు పండ్ల తోటల పెంపకంపై అవగాహన కల్పించాలని డ్వామా ఏపీడీ పద్మశ్రీ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వచ్చే ఏడాది ఉపాధిహామీ పథకం ద్వారా 97 రకాల పనులు చేపట్టేందుకు అవకాశం ఉందన్నారు. ఏపీఓ మురళి, ఈసీ ప్రసాద్, సిబ్బంది రాజు, బలరాం, హరికృష్ణ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

### నేడు మండల సర్వసభ్య సమావేశం

**తాళ్లూరు (ముండ్లమూరు):** స్థానిక మండల పరిషత్ కార్యలయంలో బుధవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహిస్తామని మంగళవారం ఒక ప్రకటనలో ఎంపీడీఓ కేవై కీర్తి తెలిపారు. ఉదయం 10 గటలకు జరిగే సమావేశానికి హాజరు కావాలన్నారు.

# మిర్చిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి


మిర్చి తోటను పరిశీలిస్తున్న ఉద్యానశాఖ అధికారి రమేష్

**మార్కాపురం రూరల్:** మార్కాపురం ప్రాంతంలో సాగవుతున్న మిర్చిలో తామరపురుగును గుర్తించామని, రైతులు నివారణ చర్యలు చేపట్టాలని ఉద్యాన శాఖాధికారి రమేష్ తెలిపారు. తామర పురుగులు ఆకుల అడుగు భాగంలో గుంపులుగా చేరి రసాన్ని పీల్చడం వల్ల ఆకులు పైకి ముడుచుకుపోతాయన్నారు. దీని నివారణకు లీటర్ నీటికి ఎస్పేట్ 1.5 గ్రాములు లేదా ఫిప్రోనిల్ 2 మి.లీ లేదా క్లోరిపైరిపాస్ 2 ఎమ్ఎల్ కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. మిరప పంటపై అధిక గాఢత కలిగిన మందులను వాడటం వల్ల ఆకులు ఎండిపోతున్నాయని, అవి కోలుకునేందుకు గ్లూకోజ్‌వాటర్ లేదా చక్కెర నీళ్లు పైపాటుగా పిచికారీ చేయాలని తెలిపారు. ఆయన వెంట సిబ్బంది భాగ్యలక్ష్మి, మల్లికార్జున ఉన్నారు.

# మిరప పొలంలో గంజాయి మొక్కలు


గంజాయి మొక్కలతో సెబ్ అధికారులు

**యర్రగొండపాలెం:** మండలంలోని గురిజేపల్లి గ్రామానికి చెందిన మిరప పొలాల్లో పెరుగుతున్న 3 గంజాయి మొక్కలను బుధవారం సెబ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. శ్రీకాంత్‌రెడ్డికి చెందిన మిరప తోటలో గంజాయి మొక్కలు పెంచుతున్నట్లు సమాచారం అందుకున్న మార్కాపురం ఏఈఎస్ జి.దేవదత్తు ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు చేసి గంజాయి మొక్కలను గుర్తించారు. ఏపుగా పెరిగిన ఈ మొక్కలను వారు స్వాధీనం చేసుకొని విచారణ చేపట్టారు. దాడుల్లో యర్రగొండపాలెం సెబ్ ఇన్‌స్పెక్టర్లు ఎస్.వెంకటరమణ, ఎస్‌డీహెచ్ రహిమాన్, సిబ్బంది పాల్గొన్నారు.

# ఖాదీ వస్త్రాలు సంప్రదాయ నేస్తాలు


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈవో ఆంజనేయులు

**యర్రగొండపాలెం:** ఖాదీ వస్త్రాలు సంప్రదాయ నేస్తాలని ఎంఈవో పి.ఆంజనేయులు అన్నారు. బుధవారం ఖాదీ మహోత్సవ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు ఖాదీ వస్త్రాలు మన సంప్రదాయ నేస్తాలు అనే అంశంపై మండల స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు. అంతరించి పోతున్న ఖాదీ వస్త్రాల ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలిపేందుకు పోటీలు దోహదపడతాయన్నారు. ఈ వస్త్రాలు దేశ చరిత్ర, సంస్కృతికి నిలయాలని, వీటిని ధరిస్తే అనేక మందికి జీవనోపాధి లభిస్తుందని ఆయన విద్యార్థులకు బోధించారు. జిల్లా పరిషత్, కేజీబీవీ, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు రాజేశ్వరి, అమృత, సుమియ బహుమతులు అందుకున్నారు. ఉపాధ్యాయులు రత్తయ్య, శ్రీకాంత్ పాల్గొన్నారు.

### ఓట్లు చేర్పులు, తొలగింపులపై నిబంధన


మాట్లాడుతున్న లోకేశ్వరరావు

**దర్శి:** ఎవరైనా ఒక వ్యక్తి ఉద్దేశ పూర్వకంగా ఐదుకంటే ఎక్కువ ఓట్లు చేర్పించడం, మార్పులు చేయడం చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి లోకేశ్వరరావు హెచ్చరించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం పలు పార్టీల నేతలతో మాట్లాడుతూ నాయకులకు సందేహాలు, ఓట్ల తొలగింపు, చేర్పుల్లో అనుమానాలు ఉంటే ఈనెల 9వ తేదీ లోపు తెలియపరచాలని సూచించారు. దర్శి, కురిచేడు, తాళ్లూరు, తహసీల్దార్లు వెంకటేశ్వరరావు, జ్వాలా నరసింహారావు, ఎలక్షన్ ఉప తహసీల్దార్ దేవప్రసాద్, రాజకీయ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# 31 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత


బియ్యం బస్తాల వద్ద అధికారులు

**బేస్తవారిపేట:** మండలంలోని బసినేపల్లెలో ఓ గృహంలో అక్రమంగా నిల్వ ఉంచిన 31 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ అనిల్‌కుమార్ మంగళవారం తెల్లవారు జామున పట్టుకున్నారు. జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించారు. రేషన్ బియ్యం నిల్వ చేసిన గృహాన్ని సీజ్ చేసి 6ఏ కేసు నమోదు చేశారు. బేస్తవారిపేట పోలీసుస్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ జితేంద్రకుమార్, వీఆర్వో ఖాశీంసా పాల్గొన్నారు.

# సాఫ్ట్‌బాల్ జాతీయ స్థాయి పోటీకి శివలక్ష్మి


శివలక్ష్మిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

**పెద్దారవీడు:** మండలంలోని ఏనుగులదిన్నెపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న జిల్లెల శివలక్ష్మి ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి అండర్–17 సాఫ్ట్‌బాల్ పోటీలో పాల్గొని జాతీయ స్థాయిలో ఆడేందుకు ఎంపికై నట్లు ప్రధానోపాధ్యాయుడు మధుసూదన్‌రావు మంగళవారం తెలిపారు. సోమవారం ఒంగోలు పీవీఆర్ స్కూల్లో రాష్ట్ర స్థాయిలో సాఫ్ట్‌బాల్ పోటీలు నిర్వహించగా మూడో స్థానంలో విజయం సాధించిందని, త్వరలో జరిగే జాతీయ స్థాయి పోటీలో పాల్గొంటుందని పేర్కొన్నారు. హెచ్ఎం మాట్లాడుతూ జాతీయ స్థాయిలో విజయం సాధించి పాఠశాలకు, గ్రామానికి మంచి గుర్తింపు తీసుకు రావాలని ఆకాంక్షించారు. శివలక్ష్మిని శాలువా, పూలమాలతో సర్పంచ్ బలుసుపాటి లూథియా, జెడ్పీహెచ్ స్కూల్ చైర్మన్ ఏర్వ పెద్దశివారెడ్డి, పీడీ దేవండ్ల చంద్ర, పీఈటీ సురేష్‌కుమార్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

### దరఖాస్తులు స్వీకరించండి


మాట్లాడుతున్న ఎంపీడీఓ హనుమంతరావు

**ముండ్లమూరు:** మండలంలో వ్యక్తిగత మరుగుదొడ్డు లేని వారిని గుర్తించి వారందరు మరుగుదొడ్లు నిర్మించుకునేలా చూడాలని ఎంపీడీఓ హనుమంతరావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉపాధిహామీ పథకం సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని పంచాయతీల్లో ఈనెల 8, 9, 9 తేదీలలో ప్రత్యేక గ్రామ సభలు ఏర్పాటు చేసి వ్యక్తిగత మరుగుదొడ్ల కొరకు దరఖాస్తులు స్వీకరించాలన్నారు. ఈఓఆర్డీ శ్రీదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

# యాజమాన్య పద్ధతులతోనే అధిక దిగుబడి


బుక్‌లెట్‌లు పంపిణీ చేస్తున్న ఆత్మ పీడీ అన్నపూర్ణ

**యర్రగొండపాలెం:** రైతులు తాము పండించే పంటల్లో మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఆత్మ పీడీ కె.అన్నపూర్ణ అన్నారు. బుధవారం మండలంలోని గంగపాలెం, వీరభద్రాపురం రైతు భరోసా కేంద్రాల పరిధిలో ఉన్న రైతు ఉత్పత్తి దారుల సంఘాల రైతులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. విత్తన శుద్ధి, పచ్చిరొట్ట ఎరువుతో పైర్ల సాగు, పంటల్లో లింగాకర్షక బుట్టలు, జిగురు అట్టలు, వేప సంబంధిత పదార్థాలు వంటి పద్ధతులను పాటించాలని ఆమె సూచించారు. దీంతో పురుగులు, తెగుళ్ల ఉధృతి తగ్గి సాగు ఖర్చు తక్కుతుందని, నికర ఆదాయం పెంచుకునే అవకాశం ఉందని ఆమె అన్నారు. అనంతరం రైతులకు వ్యవసాయ బుక్‌లెట్‌లు పంపిణీ చేశారు. జిల్లా వనరుల కేంద్రంఏవో వీవీ శేషమ్మ, డీఆర్‌సీ ఏవో శైలజరాణి, వీఏఏలు రమేష్, నాగేంద్ర పాల్గొన్నారు.

# రాష్ట్రానికి జగనన్న అవసరం ఉంది


మాట్లాడుతున్న కౌన్సిలర్ మోహన్‌రెడ్డి

**దర్శి:** రాష్ట్రానికి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అవసరం ఎంతైనా ఉందని కౌన్సిలర్ మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. నగర పంచాయతీ పరిధిలోని 3వ సచివాలయం కొత్తరెడ్డిపాలెం పరిధిలో మానమ్మకం నువ్వే జగనన్న మళ్ళీ ఆంధ్రప్రదేశ్‌కు జగనన్న ఎందుకు ముఖ్యమంత్రిగా రావాలి కార్యక్రమం జరిగింది. కౌన్సిలర్లు ఆవుల జ్యోతి శివారెడ్డి, బాబురావు, జేసీఎస్ పట్టణ కన్వీనర్ ఎదురు కోటిరెడ్డి, ఇన్‌చార్జ్ కమిషనర్ వెంకటేశ్వరరావు, సచివాలయం కన్వీనర్లు, గోనునారాయణరెడ్డి, కిక్కురు రమణారెడ్డి, బండి మల్లిఖార్జున్‌రెడ్డి పాల్గొన్నారు.

### ప్రభుత్వానికి మంచిపేరు తేవాలి


మాట్లాడుతున్న పోలయ్య

**దొనకొండ:** వలంటీర్లు, గృహ సారథులు సమన్వయంగా పని చేసి ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చిపెట్టాలని ఎంఎల్ఓ బర్దన్ అన్నారు. స్థానిక సచివాలయంలో మంగళవారం మా నమ్మకం నువ్వే జగనన్నా కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 2024లో జగనన్నను ముఖ్యమంత్రి చేయటమే మన బాధ్యత అన్నారు. మండల సచివాలయ కన్వీనర్ గుంటు పోలయ్య, ఎంపీడీఓ వి.వసంతరావునాయక్, ఏపీఎం జి.వెంకటేశ్వర్లు, ఉప సర్పంచ్ ఇమ్రాన్‌ఖాన్, పంచాయతీ కార్యదర్శి పి.క్రిష్ణమూర్తి, బత్తుల వెంకటసుబ్బయ్య, ముజాయిద్ పాల్గొన్నారు.

# వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి


ఉప్పలపాడులో సమావేశంలో పాల్గొన్న ఆరోగ్య సిబ్బంది

**పొదిలి రూరల్:** గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఉప్పలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎస్.జగదీష్ పేర్కొన్నారు. మంగళవారం పొదిలి మండలంలోని ఉప్పలపాడు పీహెచ్‌సీలో ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలకు సమావేశం నిర్వహించారు. అప్పుడే పుట్టిన బిడ్డల సంరక్షణ, గర్భిణులను ఆసుపత్రిలో చేర్పాల్సిన బాధ్యతను వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ సౌజన్య, సీహెచ్ఓ యు విజయలక్ష్మి, సూపర్‌వైజర్ నారు శ్రీనివాసరెడ్డి, మేరినా, ఏఎన్ఎంలు, ఆశలు పాల్గొన్నారు.

# సబ్సిడీపై శనగ విత్తనాలు పంపిణీ


శనగ విత్తనాలు అందిస్తున్న యార్డు చైర్మన్ శ్రీనివాసరెడ్డి

**మార్కాపురం రూరల్:** మండలంలోని భూపతిపల్లి రైతు భరోసా కేంద్రం పరిధిలోని మిట్టమీదిపల్లి గ్రామంలో మార్కెట్ యార్డు చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ అరుణా చెంచిరెడ్డి, ఏడీఏ రమాదేవీల ఆధ్వర్యంలో రైతులకు సోమవారం శనగ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యార్డు చైర్మన్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. పప్పు శనగ విత్తనాలను ప్రభుత్వం సబ్సిడీపై ఇస్తోందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జేజీ 11రకం శనగ విత్తనాలు క్వింటా ధర రూ.8,100 కాగా సబ్సిడీపై రూ.3,240 రూపాయలకు ఇస్తున్నామని రైతులు రూ.4,860 చెల్లిస్తే సరిపోతుందని రమాదేవి తెలిపారు. కార్యక్రమంలో ఏఓ దేవిరెడ్డి శ్రీనివాసులు, భూపతిపల్లి ఎంపీటీసీ లక్ష్మీ, ఆర్బీకే సిబ్బంది రమణి, శివశంకర్ నాయక్ పాల్గొన్నారు.

### 274 మందికి వైద్య పరీక్షలు

**గిద్దలూరు రూరల్:** పట్టణంలోని బ్రహ్మానందరెడ్డి వైద్యశాల ఆధ్వర్యంలో మండలంలోని కొత్తకోటలో సోమవారం నిర్వహించిన వైద్యశిబిరంలో 274 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బ్రహ్మానందరెడ్డి పర్యవేక్షణలో ప్రత్యేక వైద్య బృందం వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసింది.

# బాల్య వివాహాలు అరికట్టాలి


కరపత్రాలు విడుదల చేస్తున్న ఎంఈఓ, సీడీపీఓలు

**దర్శి:** బాల్యవివాహాలను అరికట్టి వారి భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాలని సీడీపీఓ సీహెచ్ భారతి, ఎంఈఓ కాకర్ల రఘురామయ్య అన్నారు. దళిత బహుజన రిసోర్స్‌సెంటర్ ఆధ్వర్యంలో బాల్యవివాహాలు అంతమొందిద్దాం వారి భవిష్యత్‌ను కాపాడుకుందాం అనే అంశానికి సంబంధించిన కరపత్రాలు సోమవారం విడుదల చేశారు. సమాజంలో ఎదుగుతున్న బాలబాలికలకు చిన్న వయస్సులో వివాహం చేసి వారి మానసిక సామాజిక కష్టాన్ని నష్టాలను అధిక మించాలన్నారు. సమాజంలో ఉన్న చట్టాలకు లోబడి 18 నిండిన బాలికలకు వివాహ వయస్సు అని నిర్ధారించారు. మండల కోఆర్డినేటర్ కావూరి నాగమణి, గర్నెపూడి ప్రేమ్‌కుమార్, రాచపూడి మోషె, సూపర్ వైజర్‌లు పాల్గొన్నారు.

### వైఎస్సార్ బీమా నగదు అందజేత


నగదు అందజేస్తున్న హర్షిత

**మార్కాపురం టౌన్:** పట్టణంలోని 16వ వార్డు పరిధిలో బాపూజీ కాలనీకి చెందిన అంగన్‌వాడీ ఆయాగా పనిచేస్తున్న నూతలపాటి కాంతమ్మ ఇటీవల మృతి చెందారు. ఆమె కుమారుడు లక్ష్మణ్‌కు వైఎస్సార్ బీమా కింద 10 వేల రూపాయలను 16వ వార్డు కౌన్సిలర్ దారివేముల హర్షిత మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ నాసర్‌వలి, సచివాలయ సిబ్బంది ఆదినారాయణ, వలంటీర్లు శ్రీను, కరీంబాషా తదితరులు పాల్గొన్నారు.




# త్రుటిలో తప్పిన ప్రమాదం


ఆటో నుంచి చిన్నారిని బయటకు తీస్తున్న స్థానికులు


ఆటో నుంచి వృద్ధురాలిని బయటకు తీస్తున్న స్థానికులు

**దర్శి:** కట్టెల ట్రాక్టర్‌ను ఢీ కొన్న ఆటో తిరగ బడిన సంఘటన దర్శి పరిధిలోని శివరాజనగర్‌లో మంగళవారం చోటు చేసుకుంది. కట్టెల లోడుతో వెల్తున్న ట్రాక్టర్ ట్రాలీలో వెనుక వైపు ఉన్న కట్టెలు తగిలి ఆటో తిరగ బడింది. ఆటోలో చిన్న పిల్లలు, వృద్ధులు ఉన్నారు. వారందరూ ఆటోలో ఒకరి పై ఒకరు పడి కేకలు పెట్టడంతో వెంటనే ఆటోను స్థానికులు పైకి లేపి వారందరినీ క్షేమంగా బయటకు తీశారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది.

### పాఠశాల అభివృద్ధికి హెచ్ఎం సేవలు అభినందనీయం

**తర్లుపాడు:** మండలంలోని లక్ష్మక్కపల్లి హెచ్ఎం కొశ్వెట్టి జగన్‌బాబు తాను పనిచేస్తున్న పాఠశాలలో సొంత నిధులతో తరగతి గదుల్లో పీఓపీ, ఏసీ ఏర్పాటు చేశారు. విద్యార్థులు బాగా చదువుకునేందుకు మంచి వాతావరణాన్ని కల్పించారు. ప్రత్యేకంగా రూపొందించిన పుస్తకాలను ఎంఈఓ డి.సుజాత, ఎంఈఓ–2 అచ్యుత సుబ్బారావు చేతులమీదుగా మంగళవారం విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎంను ఎంఈఓలు అభినందించారు. ఉపాధ్యాయులు అబ్దుల్ షుకూర్, సీఆర్‌ఓ వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### నేడు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు

**ఒంగోలు:** జిల్లాలో ఎంపిక చేసిన ఏడు పాఠశాలల్లో బుధవారం స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కో ఆర్డినేటర్ వీఎస్ సుబ్బారావు, జిల్లాలోని సంబంధిత మండల విద్యాశాఖాధికారులు, హెడ్మాస్టర్లను మంగళవారం ఒక ప్రకటనలో ఆదేశించారు. ఒంగోలు, టంగుటూరు, దర్శి(ఒంగోలు డివిజన్), మార్కాపురం, కనిగిరి, గిద్దలూరు, వై.పాలెం(మార్కాపురం డివిజన్)లో నిర్వహించాల్సి ఉంటుందన్నారు. డివిజన్ కేంద్రాల్లో ఆయా డివిజన్ ఉప విద్యాశాఖ అధికారులు ఇన్‌చార్జి బాధ్యత వహిస్తారన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఏడు సెషన్స్‌లో మీటింగ్ నిర్వహించడం జరుగుతుందని, కొన్ని సెషన్స్ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో నిర్వహిస్తామని తెలిపారు.

ఒక్కో కేంద్రానికి ఏయే మండలాలు కేటాయింపు జరిగిందో కాంప్లెక్స్ నిర్వహణ విధి విధానాలు, అజెండాను జిల్లాలోని అందరు ఉప విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులకు మెయిల్ చేశామన్నారు. ప్రతి నెల ఈ మీటింగ్‌ల నిర్వహణ ఉంటుందని, అందరూ తప్పక హాజరు కావాలని డీఈఓ ఆదేశించారు.

### రేపటి నుంచి సంక్షేమ పథకాలపై అవగాహన

**కురిచేడు:** ప్రభుత్వం అమలు చేస్తున్న, చేయబోతున్న సంక్షేమ పథకాల గురించి మండలంలోని పంచాయతీ కార్యదర్శులు అవగాహన కల్పించాలని ఈఓఆర్డీ ప్రసాదరావు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సచివాలయం సిబ్బంది, వలంటీర్లను మానిటర్ చేసుకుని ప్రోగ్రాం ను పూర్తిస్థాయిలో విజయవంతం చేయాలని ఆయన ఆదేశించారు. ఆయా గ్రామాల ఎంపీటీసీలు, పంచాయతీ సర్పంచ్‌లు, వార్డుసభ్యులు, సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లకు ప్రోగ్రాం షెడ్యూల్ కాపీలను అందజేయాలని పేర్కొన్నారు.